స్వాతి సపరివారపత్రిక కథల పోటీలో బహుమతి పొందిన కథ (13-9-85)

# సరసజన మనోభిరామం

'మగతీఁటి గరులకు మగువ ముంగురులకు
నేనాఁటి నేస్తమో యెఱుఁగరాదు
ఇలఁజంద్రు గోమున కింతి నెమ్మోమున
కేమిదాంపత్యమో యెఱుఁగరాదు
కపురంపుఁ దావికిఁ గలికి నెమ్మోవికి
నేయనుకులమో యెఱుఁగరాదు
బంగారు గిండ్లకుఁ బడఁతి పాలిండ్లకు
నే యనుబంధమో యెఱుఁగరాదు
కళుకు మగమాలు తెలిరాలు కనులరాలు
కాంతి జిగిచూపు మదుచేతి కలువతూపు
నతివమైమించు తళతళయనెడుమించు
నొక్కచోటనే పుట్టని దొకటె కొదవ'

'రాధికా సాంత్వనము' చదువుతున్న కృష్ణ ఒక్కసారి పుస్తకం ముడిచి బయటికి చూసాడు. ముద్దుపళని వర్ణించిన ఆ ముగ్ధమోహనరూపం దొడ్లో పందిర క్రింద నిలబడి మల్లెలతో పోటీ పడి చిరునవ్వుల కాంతులు వెదజల్లుతున్నట్టనిపించిందతనికి!

"కృష్ణా!" అన్న తల్లి పిలుపుకి ఉలిక్కిపడి స్పృహలోకి వచ్చాడు. అక్కడినుంచి లేవకుండానే "ఏమిటమ్మా" అని కేకపెట్టాడు.

తల్లే అక్కడికి వచ్చింది. "రాఘవులుగారు వచ్చి చెప్పాడు. మామయ్య, అత్తయ్య వస్తున్నార్ట. మరి ఏమంటావ్?" అని అడిగింది.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు కృష్ణ.

"ఈ మాటు నిన్ను వదిలేది లేదుట్రా అన్నయ్యా! ముహూర్తాలు పెట్టుకొని మరీ వెడతాము – అని ప్రతిజ్ఞ చేసాట్ట మామయ్య!" అని పకపకా నవ్వింది తల్లివెనుకనే వచ్చి గుమ్మంలో నిలబడిన చెల్లెలు శాంతి.

గబగబలేచి బట్టలు మార్చుకోసాగాడు కృష్ణ.

"అడిగిందానికి జవాబు చెప్పకుండా ఎక్కడికిరా ప్రయాణం!" అంది తల్లి.

"మర్చిపోయానమ్మా.... ప్రెసిడెంటుగారు అర్జంటుగా రమ్మన్నారు."

"ప్రెసిడెంటుగారు!.... రాత్రింబగళ్ళు ఇక అక్కడనే ఏమిటి?"

"ప్రెసిడెంటుగారికి పెళ్ళికాని కూతుళ్ళెవరూ లేరాయె! మరింత ఆ యిది ఏమిటో...." అని పరిహాసం చేసింది శాంతి.

ఆ'యిది' ఎదలో కదిలింది! అతని గుండె జల్లుమంది. తన కంగారుని కప్పిపుచ్చుకుంటూ చెల్లెలి నెత్తిన మొట్టి కదలి వెళ్ళిపోబోయాడు.

"వాళ్ళొచ్చేసరికి యింట్లో లేకుండా పోతావేమిట్రా?" అంది తల్లి హైరానపడుతూ.

"నేను చెప్పదల్చుకున్నది ఎప్పుడో చెప్పాను. నాకిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోవాలనిలేదు. ఆ మాటే వాళ్ళతో చెప్పు!"

"ఎదిగిన పిల్ల. కన్నవాళ్ళకి కావల్సినంత తొందర. నువ్విలా నానుస్తూ కూర్చుంటే ఎలా గట్రా!"

తల్లి మాటలు వినిపించుకునే స్థితిలో లేడతను. ఇల్లుదాటి పది అడుగులు వేసేసరికి తనువుకంటె ముందుగా ప్రెసిడెంటుగారింటికి చేరిపోయింది మనసు!

ప్రెసిడెంటుగారు చదువుకోలేదు. ప్రెసిడెంటుగారి పెద్దకొడుక్కూడా చదువుకోలేదు కాని ప్రెసిడెంటుగారి కోడలు రాధ పట్నంలో పుట్టిపెరిగింది. మెట్రిక్ చదువుకుంది.

అత్తగారు లేదు. మామగారి అప్పగారు ఇంట్లో పెద్ద దిక్కు. కాని, ఆ ముసలావిడకి పట్నవాసం పిల్లతోకన్న ఇరుగు పొరుగుతోనే కాలక్షేపం ఎక్కువ. ఇక రాధను కాదనే వాళ్ళు లేరు. కనపడ్డ పుస్తకమల్లా చదువుతుంది! కాని, మామగార్ని పుస్తకాలు తెమ్మనటానికి జంకు. మగనికి చెప్పినా మతిమరుపు.

ఊళ్ళో హైస్కూలు లేదు. పై చదువులకి అంతా పట్నం పోవల్సిందే! రాధమరిది సత్యం రోజూ సైకిలుమీద వెళ్ళి పట్నంలో చదువుకుంటున్నాడు. మరిది ద్వారా పుస్తకాలు కొనిపించి తెప్పించుకుంటుంది రాధ!

ఆ మధ్యనే పట్నంలో 'తెలుగుపండిట్'గా చదువుముగించుకొని తమ పల్లెటూరికి తిరిగి వచ్చాడు కృష్ణ. ఇంకా ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. వెంటనే ఎక్కడికో వెళ్ళి ఉద్యోగం చేసి సంపాదించవల్సిన యిబ్బందులేవీ అతనికి లేవు. కవులుకమర్చిన పొలాలున్నాయి. తను మాత్రం ప్రబంధకవుల స్నేహంలో మయిమర్చి పోతున్నాడు.

ప్రెసిడెంటుగారు తన పలుకుబడి ఉపయోగించి పట్నంలో హైస్కూల్లో ఉద్యోగం వేయిస్తానన్నాడు. కృష్ణకి సంతోషమయింది.

"అయితే, ఈలోగా వూర్కే కూర్చోటం ఎందుకు? మా వాడికి కాస్త ప్రైవేటు చెప్పు" అన్నాడు ప్రెసిడెంటుగారు.

సత్యానికి ప్రైవేటు చెప్పటానికి సాయంత్రం పూట ప్రెసిడెంటుగారింటికి రావటం మొదలు

పెట్టాడు. ప్రెసిడెంటుగారు కృష్ణ చురుకుతనాన్ని ఆకళింపు చేసుకున్నాడు. పనిలో పనిగా తన వ్యవహారాలకి సంబంధించిన రాతకోతల పని కూడా అప్పగించసాగాడు. దాంతో కృష్ణకి దాదాపు పగలంతా ప్రెసిడెంటుగారింటిదగ్గర పనితగులుతోంది.

ఓ రోజున కృష్ణ ఒంటరిగా కచ్చేరి గదిలో కూర్చుని ఏదో రాసుకుంటుండగా అక్కడికి రాధ వచ్చింది. గాజుల చప్పుడికి తలెత్తి చూశాడు కృష్ణ. రాధ చిన్నగా నవ్వింది. కృష్ణ గుండెలెందుకో జల్లుమన్నాయి.

"పాపం, ఒక్కడివే కూర్చున్నావు. నీకు బోరుగా వుండదూ!"

"అబ్బే...." అన్నాడు కంగారుగా.

కాస్త కాలక్షేపం అవుతుంది. అందాకా నేకూర్చోనా యిక్కడ!"

ఏమనగలడు?

"ఒక్కత్తెనే యింట్లో ఎంతసేపని కూర్చోను? నాకూ బోరుగానే వుంది! మా వాళ్ళెవరయినా వచ్చేదాకా యిక్కడ కూర్చుంటా!....."

"మావారలు కడుదూరము
గా వచ్చుచునున్నవారు కావున మిమ్మున్
నే వేడెద నిచ్చోటన్
మావారలు వచ్చుదనుకమసలుట కొరకున్"

తిరుపతి వేంకటకవుల పద్యం గుర్తుకు వచ్చింది కృష్ణకి.

"అదేంటండీ! ఇది మీ యిల్లు...." అన్నాడు బిడియంగా.

అతని యెదురుగా కుర్చీలో కూర్చుంటూ "నువ్వు కవిత్వం బాగా చెప్పుతావుట. సత్యం చెప్పాడు! ఏదీ ఒక పద్యం పాడు" అంది రాధ.

"అబ్బే, నాకేం రాదండీ!"

"ఊహూఁ రాదనకు. నీకెంతవచ్చో నేనూ విన్నానులే!"

చటుక్కున ఒక పాదం గుర్తుకు వచ్చింది కృష్ణకి.

"మగువ! నీతోట నొక మాఱు మాటలాడ
సరసకవితా విశేషంబు మెఱయకున్నె!"

"అదిగో! నీ నోట్లో ఏదో పలుకుతోంది. చెప్పవూ?" అంది రాధ మురిపెంగా నవ్వుతూ.

అబ్బ, ఆ గొంతులో ఎంత సమ్మోహన శక్తి!

"నువ్వు చక్కని పద్యాలు చదివితే విని ఆనందించవచ్చని వచ్చాను."

"నేను రాసినవి గొప్పగా పైకి చదువుకునేంత గొప్పవాడిని కాదు నేను'

"పోనీ, గొప్ప గొప్ప కావ్యాలు, ప్రబంధాలు చదివినవాడివే కదా! కొన్ని మంచి మంచి పద్యాలు వచ్చేవుంటాయి కదా!"

అప్రయత్నంగా అవునన్నట్టు తలవూపేసాడు కృష్ణ.

"అయితే, ఒక ప్రబంధనాయకి ఎలా వుండాలో ఒక పద్యం చెప్పు".

'పలుకులు నేర్చిన తళుకు బుత్తడి బొమ్మ
జగతికి డిగ్గిన చంద్రరేఖ
నిలుకడcగాంచిన తొలకరి క్రొమ్మించు
తావి చేకుటిన నెత్తమ్మికెంపు
నెన్నెడ పొదవిన కన్నె మామిడిగున్న
తనుపూని మెలcగు కెందమ్మి కొలను
నగపుcజూపులవడ్డ సొగసుక్రొన్నన చెండు
చేష్టలచ్చి మెలంగు చిత్రరేఖ...'

"ఎంత చక్కని పద్యం! ఎవరు రాసారు?"

"రసిక జనమనోభిరామం – అనే ప్రబంధాన్ని కూచిమంచి తిమ్మకవి వ్రాసాడు. అందులోని నాయికావర్ణన అది".

"నీ దగ్గర ఆ పుస్తకం వుందా?"

"ఎవరో స్నేహితుడు తీసుకువెళ్ళాడు. కావాలంటే తెప్పించి యిస్తాను."

"అలాగే! ప్రస్తుతం నీ దగ్గర పుస్తకాలేవున్నాయి."

"మనుచరిత్ర, వసుచరిత్ర, విక్రమోర్వశీయం, సారంగధర చరిత్ర, శృంగారనైషధం.... ఇలా చెప్పాలంటే చాలా వున్నాయి" అని నవ్వాడు కృష్ణ.

"నాకివన్నీ చదివి అర్థం చేసుకునేంత శక్తి లేదు. కాని, చదవాలన్న ఆసక్తి వుంది. పోనీ పట్టుకొచ్చియియ్యి, చదివి అర్థంకాని చోట నిన్నడుగుతా!"

"నన్నా?" అన్నాడు బిడియంగా.

"అవును. ఏం సత్యానికేకాని నాకు చదువు చెప్పకూడదా!"

"మీరు నాకన్న...."

"వయసులో కొంచెం పెద్దదాన్నయితేనేం. చదువులో చాలా చిన్నదాన్నే కదా!"

ప్రబంధాలలో ప్రధానమయినది శృంగారరసం! తనకంటె పెద్దదయిన పరాయి స్త్రీ ఎదుట కూర్చుని ఈ పద్యాలకితాత్పర్యం చెప్పటం ఎలా?

"సరే.... నా మీద ఓ పద్యం చెప్పు!"

కృష్ణముఖం ఎర్రనయింది "మీ మీదా?"

"అవును. నన్ను చూస్తే నీకేమనిపిస్తోందో వూహించి ఒక పద్యం చెప్పు."

ఆలోచించసాగాడు కృష్ణ.

"ఏమనుకోనులే! నీకేమనిపిస్తే అది...."

"ముద్దుగుల్కెడి నెమ్మోము మూడుకోట్లు
నాస సొబగెన్న డెబ్బది నాల్గుకోట్లు

నుదుటి సింధూర నామమ్ము నూఱుకోట్లు
నీకు వెలజెప్ప శక్యమే! నీలవేణి!'

"అబ్బ, నేనిన్ని కోట్లు చేస్తానా?" అని గల గల నవ్వింది.

ఒక్కసారిగా కృష్ణ ఒళ్ళు గరిపొడిచింది. అంతు తెలియని పారవశ్యమేదో అతన్ని నిలువునా చుట్టబెట్టింది.

'కాదిది మోము సత్యము మృగం బెడబాసిన చంద్రబింబమే
కాదిది చన్నుదోయి ఘనకాంచన నిర్మిత కుంభయుగ్మమే
కాదిది చొక్కమైన యలకస్థితిని మన్మథ శస్త్ర శాలయే
కాదిది కన్నుదోయి యువకాండ మతంగజ శృంఖలంబయౌ'

అన్న పద్యం గుర్తుకు వచ్చి మరికాసేపక్కడ కూర్చుంటే తనేం పిచ్చి పని చేస్తాడో అన్న భయంతో రాస్తున్న పుస్తకాన్ని చటుక్కున మూసేసి, "వస్తానండీ! కొంచెం పనుంది." అని గబగబ లేచి వచ్చేసాడు కృష్ణ.

"మీ పుస్తకాలు తేవటం మర్చిపోకండి" అని రాధ వెనుకనుంచి కేకవేసింది.

ఆ తర్వాత కృష్ణ తేక తప్పలేదు. రాధ ప్రశ్నలకి జవాబులు చెప్పక తప్పలేదు! 'ఎవ్వరు గందురో మరియు నెవ్వరు విందురో యేమనందురో... మతేమో' అన్న మొదటి బిడియం క్రమక్రమంగా అతనిలో తొలగిపోయింది.

ఓ రోజు తన మరిది పక్కనుండగానే "ఏమండోయ్ పంతులుగారూ! ఈ పొడుపు పద్యానికి అర్థం చెప్పండి" అని అడిగింది రాధ.

'అంచిత చతుర్థ జాతుడు
పంచమమార్గమునఁబోయి ప్రథమతనూజన్
గాంచియునచటఁదృతీయం
బుంచి ద్వితీయంబుఁదాటిఁయెందునురాజన్'

"పంచ భూతాలేవి? పృధ్వి అప్ తేజోర్వాయుకాశాలు. అంటే భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము. వాయువు నాల్గోవాడు. అతని కొడుకు హనుమంతుడు. అయిదవ దయిన ఆకాశంలో ప్రయాణం చేసి మొదటిదయిన భూమికి పుట్టిన సీతను చూసి మూడవదయిన అగ్నితో లంకను కాల్చి రెండవదయిన నీటిని - అంటే సముద్రాన్ని దాటి రాముని చేరాడు - అని దీనికర్థం" అన్నాడు కృష్ణ.

"మాస్టారు బలేగా చెప్పారు. అవును కదా వదినా!" అన్నాడు సత్యం సంబరపడుతూ.

కృష్ణవైపు తదేకంగా చూస్తూ, "మీ మాస్టారికి పెద్ద పెద్ద పద్యాలకి అర్థం చెప్పటం తెల్సు కాని..... నాలాంటివాళ్ళ చిన్న చిన్న మాటలకి అర్థం తెలియదోయ్!" అంది రాధ.

కృష్ణ గతుక్కుమన్నాడు.

"నీ మాటలేమిటో నాకర్థం కాలేవదినా!" అన్నాడు సత్యం.

"మీ మాస్టారికే అర్థం కానప్పుడు నీకేమర్థమవుతుందోయ్" అని కృష్ణవైపు చూస్తూ కొంటెగా నవ్వి లోపలికి వెళ్ళిపోయింది రాధ.

రాధ మాటల్లోని మర్మాన్ని పసికట్టలేనంత అమాయకుడేం కాదు కృష్ణ.

పెళ్ళయినది. పెద్దింటి కోడలు. ఆమె నవ్విందని తాను తొందరపడితే ఎటుపోయి ఎటు తిరుగుతుందో! ప్రమోదానికి బదులు ప్రమాదం ఎదురయితే! తన జాగ్రత్తలో తానుండాలి!

ఏది ఏమయినా ఒక్క మాట వాస్తవం! శ్రీనాధుడు వర్ణించినట్టు - ఆమె సొగసుకీల్జడది, సోగకన్నులది, వజ్రాలవంటిపల్వరుసది, బంగారుజిగిది, పటుపుగుబ్బలది, నయమయిన వొయ్యారి నడకలది, తళుకుజెక్కులది, బెళుకుముక్కరది, సింగాణి కనుబొమచెలువులది....

అటువంటి సమ్మోహనమూర్తి సౌందర్యారాధనలో యుగాలు కూడా క్షణాల్లా గడిచి పోతాయి. అందుకనే, అక్కడ పనివున్నా లేకపోయినా పని కల్పించుకొని ప్రెసిడెంటుగారింటికి పరుగులు పెడుతూంటాడు కృష్ణ.

ఆవేళ అర్జంటుగా పని వుందని రమ్మన్నది ప్రెసిడెంటుగారు కాదు. ఆయన, కొడుకు, అప్పగారు.... అంతా పొరుగూళ్లకి తలో పనిమీద పోయారు. వాళ్ళు వుండరని చెప్పి 'నీతో ఒక ముఖ్యమయిన విషయం మాట్లాడాలి. రేపు తప్పకుండ రా' అని రహస్యంగా క్రితం రోజునే చెప్పింది రాధ. అతనిప్పుడు గబగబ బయలు దేరింది అందుకే!

అతన్ని చూస్తూనే "వచ్చావా కృష్ణా! ఎప్పుడెప్పుడు వస్తావా అని ఎదురు చూస్తున్నా!" అంది రాధ పరవశంతో కదలాడిపోతూ. కృష్ణ ఉక్కిరి బిక్కిరయ్యాడు "తొందరగా లోపలకి రా" అని తని చేతిని పట్టుకొని లోపలికి లాక్కువెళ్ళినంత పని చేసి తలుపులు వేసేసింది రాధ.

ఆమెనుంచి మధుర పరిమళమేదో గుప్పుమని పొంగివచ్చి అతన్ని చట్టుమట్టింది. మత్తెక్కిన వాడిలా ఊగితూగిపోయాడతను.

"నిన్నొకటడగాలనుకుంటున్నా కృష్ణా!" అంది.... ఆ గొంతులో కొంత వణుకూ ఉంది. ఎంతో తెగింపూ వుంది.

"ఏమిటండీ!" అన్నాడు తడబడుతూ.

"ఎన్నో రోజులుగా యిలాంటి అవకాశం కోసం ఎదురుచూస్తున్నా, ఒక్కసారి... మళ్ళీ నిన్నడగను" ఆమె కళ్లు వింతగా మెరుస్తున్నాయి.

ఇలాంటి సన్నివేశానికి అతను ఎదురుచూడలేదా అంటే లేదని చెప్పటానికి లేదు. కాని, ఇప్పుడా వూహే నిజమవుతుంటే అతను తబ్బిబ్బయిపోయాడు.

"మీరనేదేమిటో...." అని పై మాటలు మింగేసాడు.

"ఎన్నో కావ్యాలు ప్రబంధాలు చదువుకున్న పండితుడివి. నీకు నా నోటితో చెప్పాల్సిన అవసరం లేదు. అయినా సిగ్గువిడిచి అడుగుతున్నా. నువ్వు పరాయివాడివి కావని అనుకుని

అడుగుతున్నా. నువ్వు నా వాడివే ననుకుని అడుగుతున్నా. నువ్వు నావాడివే ననుకుని గట్టిగా కావలించుకొని ముద్దెట్టుకోవా!....” ఆ మాటలన్నందుకు సిగ్గుముంచుకొచ్చి తలతిప్పేసుకుంది రాధ.

అతని గుండెలు దడదడలాడాయి. వెంటనే అతనికి నోటమాట రాలేదు.

“కృష్ణా!” అంది వెర్రిదానిలా చూస్తూ.

“మీరు... మీరు....”

“వద్దు వద్దు. మీరు మీరని నన్నింక దూరం చేయకు.”

“అదికాదు ఎవరయినా వస్తారేమో....”

“ఎవరూ రారు. మా వాళ్ళెవరూ వూళ్ళో లేరు. ఇప్పుడప్పుడే ఎవరూ రారు....”

అతను కొయ్యబారిపోయి నిలబడిపోయాడే కాని.... ఆ చక్కని అవకాశం వినియోగించు కోమని అతని నరనరాలు జివ్వుమని జిలజిలమంటూనే వున్నాయి.

“అవునులే! వలచివచ్చిన వనిత చుల్కన. అని మీ పెద్దన కవిమాటలు ఋజువు చేస్తున్నావు”

“అది కాదండీ!... నేననేది....”

“ఏమిటి నువ్వనేది? ఇన్నాళ్ళూ నా మాటలు ఇష్టం లేనివాడివయితే మా యింటి ఛాయలకి మళ్ళీ మళ్ళీ వచ్చేవాడివే కాదు. నేనంటే ఇష్టం లేనివాడివయితే నేనివాళ రమ్మనగానే వచ్చే వాడివే కాదు. మరి యిప్పుడు హఠాత్తుగా నీ మనస్సు మార్చుకోటానికి కారణమేమిటో నాకర్థం కావటం లేదు.”

తను ఆశపడలేదని తాననలేడు. కాని, తన కోరికలని వూహలకే పరిమితం చేసుకొని పరమానంద భరితుడయ్యాడు -ఇప్పుడా వూహ వాస్తవమై ఎట్టెదుట నిలిచేసరికి కలవరంగా వుంది. ఏదో భయంగా వుంది!

“.....సరే, నువ్వడక్కపోయినా నీకో సంగతి చెపుతున్నా! నేనిలా సిగ్గు విడిచి నిన్ను కోరటానికి కారణం చెపుతున్నా. ఈ జీవితంలో అనుభవించవలసినవెన్నో ఉన్నాయని - అనుభవించి ఆస్వాదించగల్గినవాళ్ళకే ఈ జీవితం సుఖసంతోషాలిస్తుందని నేను చదివిన చదువు నాకు చెప్పింది. నువ్విచ్చిన పుస్తకాలు చదివి నేనర్థం చేసుకున్నదీ అదే! కాని, నా ఆలోచన స్థాయికి చేరి నాకు సుఖాన్ని అందించే చదువు, ఆలోచన నన్ను కట్టుకున్న మహానుభావుడికి లేవు. ఆయన సర్వ ప్రపంచం వ్యాపారం, డబ్బు, లాభం... సంపాదన. అంతే! రాత్రిళ్ళు ప్రొద్దుపోయి వస్తాడు. మస్తుగా తాగి పడుకుంటాడు. పెళ్ళయి ఆరేళ్ళయినా మోడువారిన జీవితంగా మిగిలిపోయింది నాది. ఇంకీ జీవితం యిలా కడతేరిపోతుందనే నిరాశ చేసుకొని గడిపాను యింతకాలం. ఇంతలో నువ్వు వచ్చావు. ఈ యెడారిలాంటి బ్రతుకుమీద స్వాతి చినుకులు చిలికించటానికి వచ్చినట్టు వచ్చావు. నీతో మాట్లాడ్డం ఒక అదృష్టం. నీతో నీ కావ్యాల్లోకి నడిచి వెళ్ళడం ఒక భాగ్యం. నీ జీవితంలోకి ఒక్క క్షణం తొంగి చూడగలిగినా నా బ్రతుకు చిగురిస్తుందని నా ఆశ!....” అంటూ దగ్గరగా వచ్చి

అతన్ని తన చేతుల్లో చుట్టేసి గాఢంగా కౌగిలించుకుంది రాధ.

అప్రయత్నంగా అతని చేతులు ఆమె వెన్నుమీద ముడివేసుకున్నాయి. అతనిలో ప్రవహించే నెత్తురు వెచ్చతనం.... ఆమె తనూలతలో ప్రకంపనాలు చేయనారంభించింది.

మరుక్షణంలో ఏమయ్యేదో - ఆమె వక్షోజాలమీదకి త్రోసుకువచ్చిన ఆమె మంగళసూత్రం అతని గుండెలమీద వొత్తేసరికి - ఏదో ఉలిక్కిపాటుతో "మనం.... మనం తప్పు చేస్తున్నామేమో" అన్నాడు కృష్ణ.

చటుక్కున అతన్ని వదిలి పెట్టేసింది రాధ.

అతను నిర్ఘాంతపోయాడు.

"అయితే వద్దు. నువ్విది తప్పనుకుంటే వద్దు. మనస్ఫూర్తిగా నువ్వు చేయలేనిదేదీ నాకొద్దు".

అతనికేమనాలో పాలుపోలేదు.

"ఇంకెందుకిక్కడ! వెళ్ళిపో! ఇక్కడ్నుంచి వెళ్ళిపో!...." అంటూ పిచ్చిగా అరిచింది రాధ.

చేతులతో ముఖాన్ని కప్పుకొని పడగ్గదిలోకి వెళ్ళి తలుపులు వేసేసుకుంది.

లోపలికి వెళ్ళి ఆమెనోదార్చనూలేక బయటకు వెళ్ళి పోనూ లేక చాలాసేపు అక్కడే నిలబడిపోయాడు కృష్ణ.

• • •

ఎక్కడెక్కడో బయట తిరిగి రాత్రి ప్రొద్దుపోయి యింటికి వచ్చాడు కృష్ణ.

"ఏమిట్రా యింత ఆలశ్యమయింది? ఇప్పటిదాకా చూసి చూసి ఇప్పుడే అన్నం తిని పడుకున్నాడు మామయ్య" అంది తల్లి.

కృష్ణ వెంటనే మాట్లాడలేదు. కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చి, "నాకాకలిగా లేదమ్మా!" అని డాబామెట్లవైపు నడిచాడు.

"అత్తయ్య ఎదురుగా వుంటే పలకరించవేమిట్రా!" అంది తల్లి మందలింపుగా.

"మనలో మనకి పట్టింపులేమిటి వదినా! అతనికి నేను తెలియనిదాన్నా" అంది ఆవిడ.

మరో మాటకి తావివ్వకుండ డాబామీదకి నడిచాడు కృష్ణ. పై మెట్టు మీద అడుగుపెట్టేసరికి మల్లెల పరిమళం అతన్ని ముంచెత్తింది. అంతేకాదు అక్కడి దృశ్యం కూడా అతన్ని నిలవేసింది.

"అదిగో అన్నయ్య వచ్చాడు వదినా!...." అంటూ శాంతి చాపమీద నుంచి చటుక్కున లేచింది. ".... ఇప్పుడే వస్తా" అని కిసుక్కున నవ్వి గబగబా మెట్లవైపు వెళ్ళి అన్నగార్ని తప్పించుకొని క్రిందకి వెళ్ళిపోయింది.

"లలిత కూఢా వచ్చిందా" అని తనలో తను అనుకుంటూ అక్కడే నిలబడి చూస్తుండి పోయాడు కృష్ణ.

లలిత కంగారుగా పైకి లేచింది. ఒళ్ళోని పూలన్నీ చాపమీద చెల్లా చెదురుగా పడిపోయాయి. ముడుస్తున్న మాల జేచారి పడిపోయింది. అతనివైపు బిత్తరగా చూసింది. గబుక్కున

క్రిందకి వంగి పూలన్నీ కుప్పగా చేసి తన పమిటిచెంగులో పోసుకొని మెట్లవైపు నడిచింది.

శరద్రాత్రి. దేవతా స్త్రీలు దీపాలు తీర్చినవేళ. పండు వెన్నెల జగమంతా కురుస్తున్న వేళ. మల్లెల పరిమళంలో స్నానం చేస్తున్న ముగ్ధ మోహనమూర్తి!

ఆవేళ మధ్యాహ్నం జరిగింది వేరు. ఇప్పుడు జరుగుతున్నది వేరు. అప్పుడు ఆవేశం రావటం ఉధృతంగానే వచ్చింది - అణిగిపోవటమూ అంత తొందరగానే జరిగిపోయింది. అప్పుడు కోరికలు రేపింది ఉప్పెనలా తన్ను ముంచివచ్చిన రాధ! కాని, ఇప్పుడు ..... తాను ఆశించినది, తాను యిన్నాళ్ళు అక్కర్లేదనుకున్నది తన యెదురుగా నిలిచింది. అదేం చిత్రమో క్రొత్త వ్యక్తిగా నిలిచింది. ఇన్నాళ్ళు తాను చూసిన లలితేనా ఈమె!

పీలగా.... చప్పిదవడలతో... పిలకజడతో వుండే ఆ లలితకీ ఒయ్యారంగా వాల్జడని గుండెలమీదకి వేసుకొని ఒళ్ళు పులకలెత్తించే మోహనరూపంతో ఎట్టెదుట కన్పించే లలితకీ ఎంత తేడా? ఒక్క ఏడాదిలో ఆడపిల్లలో యింత మార్పు వస్తుందా! తానెంత మూర్ఖుడు!.... ఇప్పుడు లలితను చూడకపోతే ఏమయివుండేది?

"దారియ్యి బావా!" ఆ గొంతులో ఎంతటి మధుర ప్రకంపన!

"దివినుండి భువికి దిగివచ్చిన దేవతవి.... మానవమాత్రుడ్ని. నన్ను దారి అడుగుతావేమిటి?"

సిగ్గు ముంచుకొచ్చి అటువైపు తిరిగింది లలిత. కృష్ణ ఆమెకు దగ్గరగా వచ్చాడు. ఆమె భుజాలు పట్టుకొని తనవైపు తిప్పుకున్నాడు.

"అరే, పూలు నలిగిపోతున్నాయి" అంది లలిత.

"ఏ పూలు?" అని నవ్వాడు కృష్ణ.

ఆ ముద్దరాలు మరింత ముడుచుకుపోయింది.

"ఈ మాల ముడిచేది ఎవరికి? నా మెడలో వేద్దామనా!" అంటూ ఆమె చేతిని పట్టుకొని చాప దగ్గరికి తీసుకువెళ్ళాడు.

తెరలు తెరలుగా అతనిలో పరవశం పొంగసాగింది. "నిన్నొకటడగనా? కాదు కాదు.... నేనడిగింది యిస్తావా?" అన్నాడు.

"ఏమిటీ?" అంది లలిత క్రీగంట చూస్తూ.

"ఇదే!...." అంటూ వల్లమాలినతమకంతో ఆమెను గట్టిగా చుట్టేసి తన కౌగిట్లో ఉక్కిరి బిక్కిరి చేసాడు కృష్ణ.

ఆమె చీరకొంగులోంచి జారిన మల్లెపూలు చాపమీదకి జలజల కురవసాగాయి.

'ఇన్నాళ్ళు తనని కాదన్నది ఈ బావేనా!' అన్న వింత గగుర్పాటుతో పరవశించి అతనిలో లీనమయింది లలితా కుమారి!

●